ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 23 మే 2025



జై హనుమాన్
ఘనంగా అంజన్న జయంతి



అలంకరణలో బళ్లారి వరదాంజనేయస్వామి

రామ నామం మార్మోగింది..రామభక్తుడు అంజన్నకు జై అంటూ భక్తులు పారవశ్యంతో పులకించిపోయారు. హనుమాన్ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి హనుమంతుడిని దర్శించకుని మొక్కులు తీర్చుకున్నారు. 7

రాష్ట్రంలో ఐదు అమృత్‌భారత్ రైల్వే స్టేషన్లు

● బాగల్కోటెలో ఆధునీకరించిన రైల్వేస్టేషన్ ప్రారంభం ● వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోదీ ● ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి సోమణ్ణ



వర్చువల్‌గా ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ రైల్వే పథకంలో భాగంగా రాష్ట్రంలో నైరుతీ రైల్వే పరిధిలోని గదగ్, ధారవాడ, బాగల్కోటె, బెళగావి జిల్లా గోకాక్, కొప్పళ జిల్లా మునీరాబాద్ రైల్వేస్టేషన్‌ను అధునికీ కరించారు. ప్రధాని నరేంద్రమోదీ వీటిని వర్చువల్‌గా గురువారం లాంచనంగా ప్రారంభించారు. ఈ రైల్వేస్టేషన్‌ల విన్యాసం ఆయా ప్రాంతాల కళలు, సంస్కృతి, వాస్తు శిల్ప రూపంతో రూపొందించబడ్డాయి. ప్రతి రైల్వేస్టేషన్ లోనూ ప్రత్యేక సౌరశక్తి విభాగం ఏర్పాటు చేశారు. బాగల్కోటెలో ఆధునికీకరించిన రైల్వేస్టేషన్‌ను కేంద్ర రైల్వే సహాయ మంత్రి వీ సోమణ్ణ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సోమణ్ణ మాట్లాడుతూ రైల్వే రంగ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రూ.2.65 లక్షలకోట్లతో దేశవ్యాప్తంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. తమ ప్రభుత్వం పదేళ్లలో 7లక్షల 50వేల కోట్ల రూపాయలతో 44వేల కిలోమీటర్ల కొత్త పట్టాలను అమర్చిందన్నారు. యూపీఏ పాలనలో డబ్లింగ్ పనులకు 11,500 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, మా ప్రభుత్వ అవధిలో 70వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. తమ ప్రభుత్వం వికసిత భారత్ సాధించడమే ధ్యేయంగా ఉందన్నారు. ఎంపీ పీసీ గద్దిగౌడర్ మాట్లాడుతూ కుడచి రైలు మార్గంలో రాష్ట్రప్రభుత్వం కారణంగా భూస్వాధీనం జాప్యమైందన్నారు. చిత్రదుర్గ - ఆల్మట్టి కొత్త రైల్వే మార్గానికి త్వరలో డీపీఆర్ సిద్ధం కానుందన్నారు. రూ.16కోట్లతో ఆధునికీకరించిన ˘గర రైల్వేస్టేషన్‌లో అత్యాధునిక సౌలభ్యాలు కల్పించినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ పీహెచ్ పూజార మాట్లాడుతూ ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా విజయపుర - బెంగళూరు సూపర్‌ఫాస్ట్ రైలు ప్రారంభించాలన్నారు. అయోధ్యకు వెళ్ళే రైలు వారానికి మూడుసార్లు తిరిగేలా విస్తరించాలన్నారు. గుజరాత్, రాజస్థాన్‌లను కలిపే రైలు సదుపాయం కల్పించాలన్నారు. జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ను బాగల్కోటెకు విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో చిత్రదుర్గ ఎంపీ గోవింద కారజోళ, తెరదాళ ఎమ్మెల్యే సిద్దు సవది, ఎమ్మెల్సీ హనుమంత నిరాణి, మాజీ మంత్రి మురుగేశ్ నిరాణి, రైల్వే డీఆర్ఎం బేలా మీనా తదితరులు పాల్గొన్నారు.




జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి సోమణ్ణ



అగర చెరువు

ఎవరికి వారే..!



● చెరువుల అభివృద్ధికి సహకారం కరువు ● కలిసిరాని పలు శాఖలు
● సంక్లిష్టంలో 41వేల చెరువులు ● మార్పులకు మీనమేషాలు

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): చెరువుల సంరక్షణ, సమగ్ర అభివృద్ధికి ఏకరూప విధానాన్ని రూపొందించి అమలు చేయాలనే ప్రయత్నాలకు సహకారం అందడం లేదు. పర్యవసానంగా వేలాది చెరువులు అభివృద్ధికి నోచుకోని పరిస్థితికి చేరాయి. సొంతంగా ఆర్థికవనరులు తగ్గుతాయనే కారణంతో చెరువులు, కట్టల అభివృద్ధి చేపట్టకపోవడం, పైగా పలుశాఖలు చెరువులకోసం నిధులు కేటాయించడానికి తమ పరిధిలోకి రావని వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో చెరువుల సంరక్షణ, అభివృద్ధి ప్రాధికార కూడా సభలో చేసిన తీర్మానాలు కూడా కేవలం రికార్డులకే పరిమితం అయ్యాయి.

రాష్ట్రంలో 41,875 చెరువులు, జలాశయాలు వివిధశాఖలకు కేటాయించారు. సంరక్షణ, సమగ్ర అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. ఆక్రమణల సమస్య పెరిగింది. చెరువుల రక్షణ, టాస్క్‌ఫోర్స్ సిఫారసులతో కోర్టు ఆదేశాలు కూడా సంపూర్ణంగా పాటించడం లేదు. చెరువుల సంరక్షణ, అభివృద్ధి ప్రాధికార ద్వారా రాష్ట్రంలోని అన్ని జలమూలాలను అభివృద్ధి చేసి చెరువుల రూపురేఖలు మార్చాలని చిన్నతరహా నీటి పరిశ్రమలశాఖ తీర్మానించింది. సదరు ప్రాధికారకు సీఎం అధ్యక్షుడు కాగా చిన్నతరహా నీటిపారుదలశాఖ మంత్రి ఉపాధ్యక్షుడిగా ఉంటారు. చెరువుల కొలతలు, ఆక్రమణలు గుర్తించడం వాటిని తొలగించడం, అభివృద్ధి చేయడం, ఆదాయాన్ని పెంచుకోవడంతోపాటు ఇతరత్రా కార్యకలాపాలకు ప్రాధికారదే బాధ్యతగా ఉంది.

ముఖ్యమంత్రే అధ్యక్షుడిగా..

చెరువుల సంరక్షణ, అభివృద్ధి ప్రాధికార చట్టం ప్రకారం నిబంధనలు పాటించేందుకు పలుశాఖలు సహకరించడం లేదని ప్రాధికారవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాష్ట్రంలో 41,875 చెరువులపైకి 31,033 చెరువుల కొలతలు పూర్తయ్యాయి. 11,200 చెరువుల ఆక్రమణలు గుర్తించారు. 5,967 చెరువుల ఆక్రమణలను తొలగించారు. ప్రాధికార ఛైర్మన్ హోదాలో సీఎం సిద్దరామయ్య అనుబంధమైన శాఖల మంత్రులు, ముఖ్య అధికారులతో సమావేశం జరిపారు. కానీ నిబంధనలు పాటించేందుకు దాదాపు అన్నిశాఖలు వెనుకడుగు వేస్తున్నాయి. పంచాయతీ రాజ్, నగరపాలకశాఖలు తమకు చెరువుల అభివృద్ధి అదనపు బాధ్యతగా భావించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆదాయం పెంపునకు అవకాశాలు

ప్రభుత్వం ఖజానా నుంచి ఖర్చు చేయడం కాకుండా పెట్టుబడులు సాధించేందుకు అవకాశాలు ఉన్నాయి. చిన్ననీటిపారుదలశాఖ 71 చెరువులను మత్స్య సహకారసంఘాలకు కేటాయించి 33.58 లక్షల రూపాయల ఆదాయాన్ని గడించింది. అదే టెండర్ కమ్ వేలం ద్వారా 381 చెరువులను మత్స్యకారులకు కాంట్రాక్టు పద్ధతిన కేటాయించడం ద్వారా రూ.2.54 కోట్ల ఆదాయం సంపాదించింది. 41,875 చెరువులను ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్యపరమైన వ్యవహారాలకు సద్వినియోగం చేసుకుంటే ప్రాధికార ఆర్థికంగా మరింత బలంగా కానుంది. చెరువు వినియోగదారుల సహకారసంఘాలు పునరుద్ధరణ సాధ్యం కానున్నాయి. ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచే కేంద్రాలు కానున్నాయి. ఇందులో భాగంగానే చెరువుల్లో తేలియాడే తరహాలో సౌరవిభాగాలను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని ప్రాధికార, చిన్ననీటి పారుదలశాఖ భావిస్తోంది. బీహెచ్‌ఈఎల్ సమర్పించిన సాధ్యమయ్యే తరహాలో నివేదిక సమర్పించింది. ఏడాదిలో 365 రోజుల్లో 65శాతం నీటి సేకరణ సాధ్యం కానుంది. 100 ఎకరాల విస్తీర్ణంలోని 40 చెరువుల్లో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి 2,500 మెగావాట్ల ఉత్పత్తిని సాధ్యం చేయవచ్చునని బీహెచ్‌ఈఎల్ నివేదికలో స్పష్టం చేసింది. ఎత్తిపోతల ప్రాజెక్టులకు విద్యుత్ సమకూర్చేందుకు రూ.10-12 కోట్లు చిన్ననీటి పారుదలశాఖ భరిస్తోంది. చెరువులలో తేలియాడే సోలార్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ విక్రయం ద్వారా ఆదాయం కూడా రానుందని బీహెచ్‌ఈఎల్ నివేదికలో పేర్కొంది. సదరు నివేదికపై సాంకేతిక పరిశీలన దశలో ఉంది.

ప్రాధికార ఎదుర్కొనే సమస్యలు

చెరువుల అభివృద్ధికి ప్రముఖమైన పాలసీలు, నిర్ణయాలు, సమగ్ర అభివృద్ధి ఆక్రమణల తొలగింపు ప్రక్రియకు సీఎం అధ్యక్షతన జరిగే సభలలో పరిశీలిస్తున్నారు. జలవనరులు, చిన్ననీటి పారుదలశాఖ, నగరాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్, అటవీశాఖలకు చెరువులను పర్యవేక్షించేందుకు పంపిణీ చేశారు. ప్రస్తుతం ప్రాధికార ఏర్పాటు సంబంధితశాఖలు వాపసు చేయడానికి వెనుకడుగు వేయడం, అభివృద్ధి చేయకపోవడంతో చెరువుల సంరక్షణ అభివృద్ధి ప్రాధికార ఎటూ నిర్ణయం తీసుకోలేకపోతోంది. చెరువులను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకున్నారనేది ప్రతి చోటా వినిపిస్తున్న అంశమే. చెరువుల ఆక్రమణలకు రాజకీయ పార్టీలు కూడా కారణమే. స్థానికంగా పలు ప్రయోజనాలకు చెరువులను ఆక్రమించుకున్నారు. ప్రస్తుతం వాటిని తొలగించాలంటే పెను సవాల్‌గా మారింది. 41వేలకుపైగా చెరువులను సంపూర్ణంగా అభివృద్ధి చేస్తే ఏటా పంటలసాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. పైగా చెరువుల్లో చేపల పెంపకం, వేసవిలో గడ్డి ప్రత్యామ్నాయమైన పంటల సాగును ప్రోత్సహిస్తే ఆదాయం పెరగనుంది. శాఖల సమన్వయం లేక వేలాది చెరువుల ద్వారా వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు.

పన్నుల బదిలీకి అభ్యంతరం

నగరాభివృద్ధి ప్రాధికార, ప్లానింగ్ అథారిటీ, పురసభ ప్లానింగ్ అథారిటీ ఆమోదించే లే అవుట్‌లకు ఎకరాకు లక్ష రూపాయల చొప్పున చెరువు సంరక్షణ ఫీజును సేకరిస్తారు. వీటిలో 25శాతం ప్రాధికారకు బదిలీ చేయాలని నగరాభివృద్ధి శాఖ ముఖ్యులకు చెరువుల సంరక్షణ అభ్విృద్ధి ప్రాధికార సీఈఓ లేఖ రాశారు. అయితే సేకరించిన ఫీజులో 25శాతం చెరువుల అభివృద్ధికి కేటాయిస్తే తమ ఆదాయం తగ్గుతుందనే కారణంతో నగరాభివృద్ధిశాఖ తదుపరి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. నిబంధనల ముసుగులో జాప్యం చేస్తోంది. నిర్ణయించిన నిబంధనల ప్రకారం చెరువుల పునరుద్ధరణ మార్గదర్శకాలను విడుదల చేశారు. చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టేవేళ ప్రాధికార అనుమతులు పొందుతామని, కానీ నగరాభివృద్ధి విభాగానికి వచ్చిన పన్నును బదిలీ చేయడం సాధ్యం కాదని నగరాభివృద్ధిశాఖ తేల్చి చెబుతోంది. పన్నులు బదిలీ చేసే ఆదేశాలు జారీ చేసేముందు కేటీపీపీ చట్టాన్ని పరిశీలించలేదని సూచిస్తోంది. ఇలా కేటీపీపీ చట్టం కింద సేకరించిన పన్నులలో 25శాతాన్ని చెరువుల సంరక్షణా ప్రాధికారకు బదిలీ చేయడం సాధ్యం కాదని నగరపాలకశాఖ స్పష్టం చేస్తోంది.

సంతృప్తికరంగా వర్షాలు

ఇటీవల రెండేళ్లలో సంతృప్తికరంగా వర్షాలు కురుస్తున్నాయి. 2024లో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు దాదాపు 3 నెలలకుపైగా నిండుకుండలా తొణికిసలాడాయి. ఈ పర్యవసానంతో ప్రాజెక్టులనుంచి కాలువల ద్వారా చెరువులకు నీరు మళ్లించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. చెరువుల అభివృద్ధి విషయంలోశాఖల మధ్య సమన్వయం పాటిస్తే మరిన్ని చెరువులకు సంపూర్ణంగా నీరు చేర్చడం ద్వారా మరింత సాగు విస్తీర్ణం పెంచేందుకు దోహదపడనుంది.

వేలాంకన్ని వెళ్తూ మృత్యు ఒడిలోకి..

● బస్సు-టూరిస్టు వ్యాన్ ఢీకొని ఆరుగురి మృతి ● బెంగళూరు నుంచి వెళ్లిన భక్తులు ● ఏడుగురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన బస్సు ముందు భాగం

టి.నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): తంజావూరు సమీపంలో గురువారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరు నుండి వేలాంకన్నికి ఓ టెంపో వ్యాన్‌లో 12 మంది బయలుదేరారు. తంజావూరు సమీపంలోని చెంగిపట్టి ప్రాంతంలో తారు రోడ్డు పనులు జరుగుతుండటంతో వాహనాలు ఒన్‌వేలో నడుపుతున్నారు. ఆ రహదారిలో వేగంగా వచ్చిన టూరిస్టు వ్యాన్ తంజావూరు నుండి తిరుచ్చి వస్తున్న రాష్ట్ర రవాణా సంస్థ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందు భాగంగా నుజ్జునుజ్జయింది. వ్యాన్‌లో ప్రయాణించిన ఇద్దరు మహిళలు సహా నలుగురు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వీరందరినీ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళుతుండగా మార్గమధ్యంలో చార్సెల్ మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స ఫలించక మరొకరు గురువారం ఉదయం మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 6కు పెరిగింది. వ్యాన్ ప్రయాణికుల్లో గాయపడిన జాన్సన్ (49), జాయిస్ (20), తాషి (7), రియా (13), పెల్సియా కరోలిన్ (13), విలియమ్ (50), బస్సులో ప్రయాణిస్తూ గాయపడిన పరమేశ్వరి (52), పవిత్ర (23) సహా ఎనిమిదిమంది తంజావూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందగానే జిల్లా కలెక్టర్ ప్రియంకా పంకజం, తంజావూరు డీఎస్పీ ఇరా రాజారాం సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. చెంగిపట్టి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



నుజ్జయిన టూరిస్టు వ్యాన్

ప్రతిపక్షనేత చలవాది ఘెరావ్

● అడ్డుకున్న మంత్రి ప్రియాంకఖర్గే అనుచరులు ● నారాయణ స్వామి వ్యాఖ్యలపై కార్యకర్తల ఆగ్రహం

బెంగళూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక గ్రామీణాభావృద్ధిశాఖా మంత్రి ప్రియాంకఖర్గేను దూషించారంటూ విధానపరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామిని కార్యకర్తలు అడ్డుకున్నారు. కలబురిగి జిల్లాలోని మంత్రి నియోజకవర్గం చిత్తాపురకు వెళ్ళిన సందర్భంలో సుమారు నాలుగైదు గంటల పాటు చలవాది గెస్ట్‌హౌస్ నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఇటీవల పధానమంత్రి నరేంద్రమోదీ పట్ల ప్రియాంకఖర్గే తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్‌తో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకున్నప్పుడు ప్రధానమంత్రి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తాజాగా ప్రపంచంలోని వివిధ దేశాలలో ప్రధానమంత్రికి సన్నిహిత సంబంధాలు ఉంటే ఎంతమంది మద్దతు ఇచ్చారంటూ ప్రశ్నించారు. ఇదే విషయమై చలవాది నారాయణస్వామి రోడ్డుపై ఏనుగు వెళుతుంటే కుక్కలు మొరుగుతాయని అంత మాత్రాన ఏనుగుకు ఏమాత్రం గౌరవం తప్పదన్నారు. ఇలా వ్యాఖ్యానించిన తర్వాత మంత్రి ప్రియాంకఖర్గే సొంతనియోజకవర్గానికి బుధవారం సాయంత్రం వెళ్ళారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు, ఖర్గే అభిమానులు చలవాదిని అడ్డుకున్నారు. సుమారు నాలుగుగంటలకు పైగా ఆయన గెస్ట్‌హౌస్ లోనే గడపాల్సి వచ్చింది. చలవాది కారుపై రంగులు చల్లి నినాదాలు చేశారు. కాగా చలవాదిని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకోవడంపై స్పందించిన ప్రియాంకఖర్గే మాట్లాడుతూ చిత్తాపురకు వచ్చినందుకు అతడికి ఏమైనా పద్మవిభూషణ్ ప్రకటించాలా కార్యకర్తలకు కోపం వచ్చింది అడ్డుకున్నారంటూ దాటవేశారు. ఆతర్వాత కలబురిగిలో చలవాది నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ అది ఓ సామెతగా వ్యాఖ్యానించానని మంత్రి ప్రియాంక ఖర్గే పేరును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. అతడి పేరును వాడినందుకు విచారం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.



ప్రతిపక్షనేత కారుపై ఇంకు చల్లిన కాంగ్రెస్ కార్యకర్తలు



పరీక్షా కేంద్రానికి వెళ్తున్న వధువు సంగీత

పెళ్లిపీటల నుంచి నేరుగా పరీక్షాకేంద్రానికి..

● చామరాజనగర్ జిల్లా కొళ్ళేగాలలో పరీక్షకు హాజరైన వధువు

7

మంగళూరు విమాన ప్రమాదానికి 15 ఏళ్లు

● నాడు అమరులైన 158 మంది ప్రయాణికులు ● శ్రద్ధాంజలి ఘటించిన జిల్లా యంత్రాంగం



మృతుల స్మారకం వద్ద పూజలు చేస్తున్న జిల్లా అధికారి ఆనంద్

ఇద్దరు కార్మికుల మృత్యువాత

● ఫ్యాక్టరీ సంప్ శుభ్రం చేస్తుండగా ప్రమాదం..
● మరో ఇద్దరి పరిస్థితి విషమం
● తుమకూరు జిల్లాలో ఘోరం

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): సంపు శుభ్రం చేస్తుండగా ఇద్దరు కార్మికులు మృత్యువాత పడ్డారు. తుమకూరు తాలూకా వసంతనరసాపుర పారిశ్రామికవాడలో రసాయనాలు సేకరించిన సంప్‌ను శుభ్రం చేస్తున్న వేళ ఇద్దరు కార్మికులు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మధుగిరి తాలూకా మాగోడు గ్రామానికి చెందిన ప్రతాప్ (23), శిరా తాలూకా తరూరు గ్రామానికి చెందిన వెంకటేశ్ (32) మృతి చెందారు. సంప్‌ను శుభ్రం చేసేందుకు నలుగురు కార్మికులు లోపలికి దిగారు. వీరిలో ఇద్దరికి ఊపిరి తీసుకోవడంలో సమస్య తలెత్తడంతో అక్కడికక్కడే మృత్యువాత చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని తుమకూరు సిద్ధగంగా ఆసుపత్రిలో చేర్పించారు. కార్మికుల మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి కేశవ్, ఎమ్మెల్యేలు, నాయకులు





మీ కష్టంతోనే గెలిచాం..!

● పనిచేసినవారికే ప్రాధాన్యం

పొద్దు తిరుగుడు పువ్వులు అవసరం లేదు : కేశవ్

అనంతపురం/అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల్లో మమ్మల్ని గెలిపించారు. మీ కష్టంతోనే మేము వేదికపై కూర్చున్నాం. మీ కష్టాలలో తోడుగా మేముంటాం. మీ రుణాన్ని తీర్చుకుంటాం. పార్టీ కోసం పనిచేసిన వారికి తప్పని సరిగా ప్రాధాన్యం ఇస్తాం' అని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ టీడీపీ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా జిల్లా అభివృద్ధికి పాటుపడుతూనే, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తామని అన్నారు. అనంతపురం శివారులోని ఓ ఫంక్షన్ హాలులో టీడీపీ జిల్లా మినీ మహానాడు సభను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సభ ప్రారంభానికి ముందు రెండు నిమిషాలు మౌనం పాటించి, గత రెండేళ్లలో మరణించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సంతాపం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన వీరజవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పొద్దు తిరుగుడు పువ్వులు వద్దు: కేశవ్

కొందరు నాయకులు ఏ పార్టీ అధికారంలో ఉంటే అటువైపు పొద్దుతిరుగుడు పువ్వు తరహాలో చూస్తుంటారని, అలాంటివారికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం లేదని కేశవ్ అన్నారు. టీడీపీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తొలిప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఈ పద్ధతి తప్పితే పార్టీ కోసం కష్టపడిన వారిలో అసంతృప్తి రేకెత్తుతుందని, అలా జరగకుండా ప్రజాప్రతినిధులు చూసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రానికి మంత్రినైనా, జిల్లాకు ఒక కూలీగానే పనిచేస్తానని అన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పనులు చేసేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నామని అన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతోపాటు సకాలంలో పనులు ప్రారంభించామని, చెప్పిన మాటలను చేతల్లో చూపిస్తున్నామని అన్నారు. ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా నిశ్శబ్దంగా హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చకచకగా జరిగిపోతున్నాయని అన్నారు. పొగతాగడం హానికరం అని సిగరెట్ పాకెట్‌పై ఎలా ముద్రించి గుర్తు చేస్తుంటారో... వైసీపీ పాలన ఈ రాష్ట్రానికి హానికరమని ప్రజలకు మళ్లీ మళ్లీ చెప్పాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే ఈ విషయాన్ని పదే పదే ప్రజలకు చెబుతూనే ఉండాలని అన్నారు.

తరలివచ్చిన నాయకులు

జిల్లా మినీ మహానాడుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు రామలింగారెడ్డి, గాజుల ఆదెన్న, కేసీ హరి, సరిపూటి సూర్యనారాయణ, బాంబే డయింగ్ నాగన్న, పర్వతనేని శ్రీధర్‌బాబు, గంజే నాగరాజు, డేగల కృష్ణమూర్తి, అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీ, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సస్యశ్యామలం: వెంకటశివుడు యాదవ్

హంద్రీనీవా కాలువ వెడల్పుతో అదనపు నీరు వస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. వైసీపీ హయాంలో పరిశ్రమలను తరిమేశారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే రాష్ట్రానికి తిగిరి పరిశ్రమలు తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, అన్ని స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయాలని అన్నారు. 'మళ్లీ అధికారంలోకి వస్తే మీ కథ చూస్తాం' అని జగన్ చెబుతున్నారంటే.. ఒక్కసారి అందరూ ఆలోచించుకోవాలని, పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు పాటుపడాలని అన్నారు.



ఏకపక్షంగా గెలవాలి: కాలవ

రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన శక్తిగా పార్టీని నిలపాలని, ఏకపక్షంగా అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తామని అన్నారు. పింఛన్ల పంపిణీ, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ తదితర పథకాల అమలు గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చాటిచెప్పాలని అన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు వేగంగా సాగుతున్నాయని, ఇందుకు సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ఆర్థిక మంత్రి హోదాలో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, అన్ని నియోజకవర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి ముందుకు సాగుతున్నారని అన్నారు.



రుణపడి ఉంటాం: అంబికా

వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించినా జైలుకు పంపారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అయినా బెదరింకుండా పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పాటుపడిన నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటామని అన్నారు. ఎమ్మెల్యేలతో పాటు తాను ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే.. పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. తనకు ఆ విధంగానే అవకాశాలు వచ్చాయని అన్నారు. పార్టీ కోసం ఎవరెవరు పనిచేస్తున్నారో అధిష్ఠానం గమనిస్తోందని అన్నారు. అనంతలో ఉద్యాన పంటలు ఎక్కువగా సాగవుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు జిల్లాలో కార్గో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసేలా మంత్రి చొరవ చూపాలని కోరారు.



ఎన్టీఆర్ బాటలో చంద్రబాబు: గుమ్మనూరు

బడుగు, బలహీనవర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత నందమూరి తారకరామారావుకు దక్కుతుందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. ఆయన బాటలోనే సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో అర్హులకు లబ్ధి చేకూరుస్తున్నారని అన్నారు. ఇటీవల గుత్తి మండలంలో రూ.22 వేల కోట్లతో రెన్యూ సంస్థ ఎనర్జీ ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయడం గర్వకారణమని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని అన్నారు.



కార్యకర్తలతోనే విజయం: దగ్గుపాటి

ఉమ్మడి జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యేల విజయానికి కార్యకర్తలే కారణమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. వారిని ఎప్పటికీ మరువమని అన్నారు. వైసీపీ పాలనలో టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు టీడీపీ పనైపోయిందని ప్రచారం చేశారని అన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని ఎవరూ కదిలించలేరని నిరూపిస్తూ కార్యకర్తలంతా కసిగా పనిచేసి 164 స్థానాల్లో విజయం సాధించేలా పాటుపడ్డారని అన్నారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పాత్ర ఎంతో ఉందని అన్నారు. చంద్రబాబు చేసేదే చెబుతారని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. అర్బన్ నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతూనే... ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని అన్నారు.



అండగా ఉంటాం: శ్రావణి

కార్యకర్తల కష్టంతోనే అధికారంలోకి వచ్చామని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ బనాయించిన అక్రమ కేసులు, దాడులను ఎదుర్కొని కార్యకర్తలు నిలబడ్డారని అభినందించారు. దేశంలోనే కోటి మంది సభ్యత్వాలు కలిగిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి, అందరికీ న్యాయం చేస్తామని అన్నారు.



కార్యకర్తలను మరచిపోం: అమిలినేని

కష్టకాలంలో నిలబడి, పార్టీ విజయం కోసం పాటుపడిన కార్యకర్తలను ఎన్నటికీ మరిచిపోమని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. అలాంటి నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ముందుండి కాపాడుకుంటామని అన్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ, 14 ఎమ్మెల్యే స్థానాలను గెలిపించిన ఘనత కార్యకర్తలకే దక్కుతుందని అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. చంద్రన్న పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

కష్టపడినవారిని గుర్తించండి: ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం

గత ఐదేళ్లలో కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసి, పార్టీ అధికారంలో వచ్చేందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపునివ్వాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం కోరారు. వైసీపీ హయాంలో ఏర్పాటైన కొన్ని సలహా మండలి కమిటీల్లో ఇప్పటికీ వారే ఉన్నారని అన్నారు. అలాంటి స్థానాల్లో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అవకాశం ఇవ్వాలని కోరారు. జిల్లాపై సీఎం చంద్రబాబుకు ఎక్కువ ప్రేమ ఉందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీని మరింతగా బలోపేతం చేయడంలో అందరూ భాగం కావాలని సూచించారు.


మృతిచెందిన టీడీపీ కార్యకర్తలు, వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తూ...

బ్రాండెడ్ లాంటిది..!

బస్టాండ్లలో వాటర్ బాటిళ్ల విక్రయాల్లో మాయాజాలం



బ్రాండ్ మాటున నకిలీ వ్యాపారం

ప్రయాణికుల ఆరోగ్యంతో చెలగాటం

నామమాత్రపు తనిఖీలకే పరిమితమవుతున్న అధికారులు


బ్రాండెడ్‌ను పోలిన నకిలీ వాటర్ బాటిళ్లు

అనంతపురం కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రయాణంలో బస్టాండులో దాహం తీర్చుకునేందుకు ఓ వాటర్ బాటిల్ కొంటే. అది బ్రాండెడ్ మినరల్ వాటర్ బాటిల్‌ను పోలి ఉంటుంది. అదే కలర్.. అచ్చం అలాంటి లోగో.. జస్ట్ ఒక ట్రెండు అక్షరాలు మాత్రం మార్చి ఉంటారు. అదే బ్రాండెడ్ వాటర్ బాటిల్ అని చెప్పి అంటగడుతుంటారు. తెలియని వాళ్లు ఆ బాటిలే కొనుక్కుని తాగుతుంటారు. అది పూర్తిగా నకిలీ. ఆ నీరు తాగితే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. వ్యాపారులు అధిక ధనార్జన ఆశతో తక్కువ రేటు నకిలీ బ్రాండ్ బాటిళ్లను అంటగడుతున్నారు. ప్రయాణికుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఇదంతా పబ్లిక్‌గానే సాగుతున్నా.. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుంటారు. నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

రూ.లక్షల్లో ఆదాయం..

బస్టాండ్లలో విక్రయించే వాటర్ బాటిళ్లలో అసలు ఏదో.. నకిలీ ఏదో.. అంత ఈజీగా కనుక్కోలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి అనంతపురం బస్టాండు మీదుగా రోజుకు 80వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్లలో బ్రాండెడ్‌ను పోలిన నకిలీ వాటర్ బాటిళ్లను అంటగడుతున్నారు. ఆ నీరు తాగితే ఆరోగ్యానికి ముప్పు తప్పదు. ఈ నకిలీ వాటర్ బాటిళ్ల గుట్టు తెలిసినవారు బ్రాండెడ్ వాటర్ బాటిల్ అడిగితే అలాంటి వారికి ఇచ్చేందుకు తక్కువ సంఖ్యలో బ్రాండెడ్ బాటిళ్లను ఉంచుకుంటున్నారు. లీటరు బ్రాండెడ్ వాటర్ బాటిల్ ధర వ్యాపారులకు రూ.16 వరకు ఉంటుందని తెలుస్తోంది. దానిని రూ.20లకు విక్రయిస్తే రూ.4 లాభం వస్తుంది. అర లీటరు బాటిల్ ధర రూ.8 ఉండగా రూ.10కి విక్రయిస్తే రూ.2 మాత్రమే లాభం వస్తుంది. బ్రాండెడ్‌ను పోలిన నకిలీ బాటిల్ లీటరు హోల్‌సేల్ ధర రూ.9.80, అరలీటరు రూ.4.50కి లభిస్తున్నాయి. వీటిని కూడా లీటరు రూ.20, అర లీటరు రూ.10కి విక్రయిస్తున్నారు. విపరీతమైన లాభం ఉండడంతో వ్యాపారులు లోకల్ వాటర్ బాటిళ్లనే ప్రయాణికులకు అంటగడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్ల పరిధిలో 700కిపైగా దుకాణాలున్నాయి. వీటిలో 400కుపైగా దుకాణాల్లో ఈ లోకల్ వాటర్ బాటిళ్ల విక్రయాలు సాగిస్తున్నారు. ఒక్కో దుకాణంలో రోజుకు 8 నుంచి 10 కేసుల వాటర్ బాటిళ్లను అమ్ముతున్నారు. ఒక్కో కేసు బాక్సుకు లీటర్ బాటిళ్లు 12, అరలీటరువి 24 చొప్పున ఉంటాయి. ఒక్కో దుకాణంలో రోజుకు సరాసరి 10 కేసుల లోకల్ వాటర్ బాటిళ్లు విక్రయించినా.. వాటిద్వారా ఎమ్మార్పీలోనే రూ.1440 అదనంగా ఆదాయం వస్తోంది. ఈలెక్కన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 400 దుకాణాల్లోనూ సాగే లోకల్ వాటర్ బాటిళ్ల విక్రయాల ద్వారా రోజుకు రూ.5.76 లక్షలు ఆదాయం వస్తోంది. నాణ్యతలేని లోకల్ వాటర్ బాటిళ్ల ద్వారా ప్రయాణికుల ఆరోగ్యం, జేబును గుల్ల చేస్తూ వ్యాపారులు పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నకిలీ వ్యవహారం బహిరంగంగానే సాగుతున్నా ఆహార భద్రత, తూనికలు-కొలతల శాఖాధికారులు గానీ, ఆర్టీసీ యంత్రాంగంగానీ చర్యలు చేపట్టట్లేదు. నామమాత్రపు తనిఖీలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఈ నకిలీ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్న ప్రయాణికులు

తనిఖీలు చేస్తాం

నకిలీ వాటర్ బాటిళ్లపై ప్రయాణికుల నుంచి ఫిర్యాదు అందలేదు. ఫిర్యాదులొస్తే కచ్చితంగా చర్యలు చేపడతాం. నెలవారీ తనిఖీల్లో దుకాణాల్లో ఐఎస్ఐ గుర్తింపు బాటిళ్లు మాత్రమే ఉన్నట్లు గుర్తించాం. మరోసారి దుకాణాలన్నింటినీ తనిఖీ చేసి, లోకల్ వాటర్ బాటిళ్ల విక్రయిస్తుంటే చర్యలు తీసుకుంటాం.

-నాగభూపాల్, డీఎం, అనంతపురం



ఏడీసీసీ బ్యాంకులో అడ్డగోలు వ్యవహారాలు

అన్నీ సక్రమంగా ఉన్నా వీఆర్ఎస్..!

బెనిఫిట్స్, కుటుంబంలోని వారికి ఉద్యోగం

తొలగించిన ఉద్యోగి.. మళ్లీ విధుల్లోకి..

వైసీపీ హయాంలో అక్రమాలు

ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం



ముడుపులిస్తే.. ఓకే..!

గత వైసీపీ ప్రభుత్వంలో ఓ ఉద్యోగి అనారోగ్యం పేరుతో అక్రమ మార్గంలో మెడికల్ సర్టిఫికెట్ తీసుకుని, వీఆర్ఎస్ పొందారు. కుమారుడికి ఉద్యోగం ఇస్తే చాలనీ, బెనిఫిట్స్ అవసరం లేదని ఏడీసీసీ బ్యాంకు అధికారులకు లేఖ ఇచ్చారు. ఆ మేరకు 2022లో కొడుక్కి ఉద్యోగం ఇచ్చారు. తనకల్లు బ్రాంచ్‌లో విధుల్లో చేరాడు. తరువాత అధికారులకు వీఆర్ఎస్ ఉద్యోగి ఇచ్చిన లేఖను మాయం చేసి, సుమారు రూ.40 లక్షల వరకు బెనిఫిట్స్ కూడా తీసుకున్నాడు. ఇందుకోసం అధికారులకు రూ.20లక్షల వరకు ముడుపులు ముట్టజెప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా రూ.6 లక్షల బెనిఫిట్స్ బకాయిలు చెల్లించేందుకు బ్యాంకులోని ఓ కీలక అధికారి ససేమిరా అనడంతో విషయం బయటకు పొక్కింది.

పెనుకొండ బ్రాంచ్‌లో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో ఓ ఉద్యోగి మంచానికే పరిమితమయ్యాడు. మెడికల్ బోర్డు కూడా అనారోగ్యాన్ని ధ్రువీకరించింది. ఆ ఉద్యోగికి వీఆర్ఎస్ ఇచ్చి, బెనిఫిట్స్ మాత్రమే అందించారు. కొడుక్కి ఉద్యోగం ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిని అప్పట్లో ఏడీసీసీ బ్యాంకు అధికారులు తిరస్కరించారు. దీనిని బట్టి ముడుపులు ఇస్తే నిబంధనలు అడ్డురావని స్పష్టమవుతోంది.

ఓబుళదేవరచెరువు మండలంలోని ఓ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఒకే పట్టాదారు పాసుపుస్తకంపై రెండు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నట్లు తేలింది. ఉద్యోగం నుంచి తొలగించారు. ఆరు నెలలు తిరక్కుండానే మళ్లీ ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం ఆ ఉద్యోగి మడకశిర మండలంలోని బ్రాంచ్‌లో పనిచేస్తున్నాడు. ఉన్నతాధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు ముట్టజెప్పాడన్న ఆరోపణలున్నాయి.

అనంతపురం క్లాక్‌టవర్, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఏడీసీసీ బ్యాంకు) అక్రమాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ హయాంలో అడ్డగోలు వ్యవహారాలతో రూ.లక్షలు చేతులు మారాయి. ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసి వసూలు చేశారని తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

అక్రమ మార్గంలో మెడికల్ ఇన్వాలిడేషన్

ఆరోగ్యం సక్రమంగా లేకపోయినా, మంచానికే పరిమితమైనా ఆ ఉద్యోగి స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకోవచ్చు. మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా ధ్రువీకరించుకుని, తదుపరి చర్యలు తీసుకోవాలి. 2022లో మెడికల్ ఇన్వాలిడేషన్‌కు కర్నూలులోని ప్రాంతీయ మెడికల్ బోర్డుకు అనంతపురం సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిపాదనలు పంపారు. సరైన కారణాలు, ఆరోగ్యం సక్రమంగా ఉందనే నెపంతో ఆ ప్రతిపాదనలు కర్నూలు రీజనల్ మెడికల్ బోర్డు తిప్పిపంపింది. అనంతపురంలో కొందరు వైద్యులకు ముడుపులు ముట్టజెప్పి, ధ్రువీకరించినట్లు అప్పట్లో ఏడీసీసీ బ్యాంకు లెటర్ హెడ్‌తో సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టి కోరం లేకపోయినా వారి మార్గంలో ఆమోదింపజేసుకున్నారు. ఆ ఉద్యోగి ఆరోగ్యంగా తిరుగుతూ బ్యాంకుకి తరచూ వచ్చివెళ్తున్నారని అక్కడ పనిచేస్తున్నవారు చర్చించుకుంటున్నారు.

ప్రేక్షక పాత్రలో అధికారులు

జిల్లాలోని సహకార బ్యాంకులు, సొసైటీలను నియంత్రించి, సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత జిల్లా సహకార శాఖ, నాబార్డు, ఆప్కాబ్ అధికారులపై ఉంటుంది. వారు ప్రేక్షకపాత్రలో ఉండిపోతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వారి తీరుపై అనుమానాలు తలెత్తుతున్నాయి. గతంలో వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై సహకార శాఖ అధికారులు విచారణ చేపట్టి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెబుతున్నా.. ఆచరణలో మాత్రం కనిపించట్లేదు.

పరిశీలిస్తాం

గతంలో ఉద్యోగుల వీఆర్ఎస్, తొలగింపుపై చర్చ వచ్చింది. అప్పట్లో ఉన్న అధికారులు ఎలా చేశారో... తెలీదు. వీఆర్ఎస్ పొందిన ఉద్యోగికి, కొడుక్కి ఉద్యోగంగానీ, బెనిఫిట్స్‌గానీ ఏదో ఒకటి మాత్రమే ఇవ్వాలి. రెండూ ఇస్తే నిబంధనలను అతిక్రమించడమే. ఒకసారి ఉద్యోగి చేసిన అక్రమాలను గుర్తించి తొలగిస్తే తిరిగి ఉద్యోగంలోకి తీసుకోకూడదు. తిరిగి ఉద్యోగంలోకి ఎలా తీసుకున్నారో పరిశీలిస్తాం. ఫిర్యాదులు వస్తే విచారణ చేసి, చర్యలకు ప్రభుత్వానికి నివేదిస్తా.




- సురేఖారాణి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కె. రాఘవేంద్రరావు (పుట్టినరోజు)



దర్శకేంద్రుడిగా పేరొందిన కోవెలమూడి రాఘవేంద్ర రావు 1942 మే 23న కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామంలో జన్మించారు. తండ్రి కేఎస్ ప్రకాశరావు కూడా దర్శకులే. తెలుగు సినీరంగంలో శతాధిక చిత్రాల దర్శకుడు. నిర్మాతగాను, స్క్రీన్‌రైటర్‌గాను, కొరియోగ్రాఫర్‌గాను సత్తా చాటుకున్నారు. 1975లో బాబు సినిమాతో దర్శకుడిగా తెరంగేట్రం చేశారు. స్త్రీ పాత్రలే ప్రధాన చిత్రాలతోపాటు అన్నమయ్య, శ్రీమంజునాథ, శ్రీరామదాసు, శిరిడిసాయి వంటి ఆధ్యాత్మిక సినిమాలు తీశారు. కొన్ని హిందీ, కన్నడ సినిమాలు కూడా తీశారు. ఐదు దశాబ్దాలలో దాదాపు అన్ని తరం నటులతోనూ సినిమాలు తీసిన ఘనత ఆయనది. బుల్లితెరపైనా తనదైనముద్రను వేశారు. 8 నంది అవార్డులు, 5 ఫిల్మ్‌ఫేర్, ఒక సైమా అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. అంతేకాక 2015 నుంచి 2019 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వ్యవహరించారు.

చంద్రమోహన్ (జయంతి)



చంద్రమోహన్ 1945 మే 23న కృష్ణా జిల్లా పమిడి ముక్కల గ్రామంలో జన్మించారు. అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖర రావు. తెలుగు సినీరంగంలో ప్రముఖ క్యారెక్టర్ నటుడు. 1966లో రంగులరాట్నం‌తో సినీప్రస్థానం ప్రారంభమైంది. కథా నాయకుడిగా 175కుపైగా మొత్తం 932 చిత్రాల్లో నటించారు. 7 నంది అవార్డులు అందుకున్నారు. పదహారేళ్ల వయసు, సిరిసిరి మువ్వ సినిమాలకు ఉత్తమ నటుడి పురస్కారాలు అందుకున్నారు. హాస్యపాత్రల్లోనూ, విలక్షణ పాత్రల్లోనూ, సహ నాయకుడిగాను రాణించారు. కొత్త హీరోయిన్‌లకు లక్కీ హీరోగా చంద్రమోహన్‌ను పేరొందారు. 2023 నవంబరు 11న కన్నుమూశారు.



ప్రత్యేకాలంకరణలో సీతారాములు



హోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా అంజన్న జయంతి

బళ్లారిరూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పలు ప్రాంతాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం బళ్లారి నగరంలో వెంకటేశ్వరనగర్‌లో వున్న ఆభయ వరదాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. హనుమ జయంతి సందర్భంగా స్వామివారికి తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, స్వామివారికి విశేషాలంకరణ, పవమానహోమం, పూర్ణాహుతి, బలి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దనుంజయ తెలిపారు.

కంప్లి : కంప్లి పరిధిలోని గ్రామాల పట్టణంలో హనుమాన్ జయంతి వైభవంగా జరుపుకున్నారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం తదితరులు పూజలు చేపట్టి భక్తాదులు మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే కిష్కిందలోనే ఆంజనేయ జన్మస్థలం అంజనాద్రి పర్వతంపైన స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. కంప్లి, ఎమ్మిగనూరు, కురుగోడు, ముద్దటనూరు, మారుతి క్యాంపు కుడితిని తదితర గ్రామాల్లో జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. భక్తాదులకు ఆలయాల వద్ద అన్నదానాలు నిర్వహించారు.

చేళూరు : శ్రీరామభక్తుడైన హనుమంతుడు జయంతిని గురువారం పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పురాణాల్లో పరాశ సంహిత ప్రకారం వైశాఖ బహుళ దశమిన ఆంజనేయుడు జన్మించినట్లుగా ప్రస్తావించడంతో ఒక్కో ప్రాంతంలో ఒక్కోరోజున హనుమజయంతి వేడుకలు నిర్వహిస్తారు. ఇందులోభాగంగా గురువారం వైశాఖబహుళ దశమిని పురస్కరించుకుని తాలూకాలో పలు ఆంజనేయస్వామి ఆలయాలలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, అలంకరణలు కొనసాగాయి. సోమనాథపురం, పాతపాళ్య, చేళూరు, చాకవేలు, చిలకలనేర్పు, ఏనిగదలె, చిన్నగానపల్లి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి విశేషపూజలు నిర్వహించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



చేళూరులో...



ముద్దటనూరులో...



కురుగోడులో...



కిష్కిందలో...

25న మహారాష్ట్ర తెలుగు సంఘం ఆధ్వర్యంలో

పలు రంగాల్లో సాధకులకు సత్కారం

బెంగళూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ మహారాష్ట్ర వారి ద్వారా వారధి పేరుతో భాషా ఇతరత్రా సాధకులకు సత్కారం చేయనున్నారు. ఈనెల 25న తెలుగు విజ్ఞాన సమితి సహకారంతో కార్యక్రమం జరుపుతున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కృష్ణదేవరాయ కళామందిరంలో ఉదయం 10గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రిష్ణగిరి ఎంపీ కే గోపీనాథ్ హాజరవుతుండగా తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు పర్యవేక్షించనున్నారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ నరసింహరాజు, కమ్మవారి సంఘం అధ్యక్షులు రాజగోపాలనాయుడులు పాల్గొంటున్నారని ప్రముఖ నటి తారా అనురాధకు ప్రత్యేక సత్కారం చేయనున్నట్లు ప్రకటించారు. తెలుగు భాషోద్దారక- కెఎస్ క్రిష్టప్ప, ఎవి సీతారామయ్య, ఆతిథ్య రత్న- నందన గ్రూపు సంస్థల ఛైర్మన్ ఆర్ రవిచందర్, విద్యాభూషణ్- ఎం రుక్మాంగద నాయుడు, సేవారత్న- కె సుబ్రమణ్యం నాయుడు, గోంసరక్షక- అరుణ్‌శర్మ, తెలుగు భాషా సేవారత్న- షన్ముఖ సున్నపురాళ్ళ, సాహితీరత్న- అంబికా అనంత్, విద్యారత్న- బండి ఆదినారాయణరెడ్డి, తెలుగు కీర్తి- డాక్టర్ కె ఆశాజ్యోతి, భాషా సేవారత్న- రంగస్వామినాయుడు, ఉమామహేశ్వరరావ్‌లకు సత్కరించనున్నట్లు ప్రకటించారు.

పెళ్లిపీటల నుంచి నేరుగా పరీక్షాకేంద్రానికి..

బెంగళూరు, మే 22(ఆంధ్రజ్యోతి): పెళ్లి పీటల నుంచి పరీక్షా కేంద్రానికి వెళ్లిందా వధువు. చామరాజనగర్ జిల్లా కొళ్ళేగాలకు చెందిన సంగీనకు నంజనగూడు తాలూకా సింధువళ్ళి గ్రామానికి చెందిన యువకుడితో బుధవారం రిసెప్షన్ వేడుకలు జరుగగా గురువారం ఉదయం పెళ్ళి జరిగింది. వధువు మెడలో వరుడు తాళికట్టగానే కళ్యాణమంటపం నిండా బంధువుల సందడి కొనసాగుతోంది. అంతలోనే వధువు సంగీత నేరుగా స్థానిక వాసవీ కళాశాలలో ఫైనల్ ఇయర్ బీకాం పరీక్షలు రాసేందుకు వెళ్లింది. ఇదే విషయమై సంగీత మీడియాతో మాట్లాడుతూ పరీక్షల తేదీలు ప్రకటించేందుకు ముందుగానే ముహూర్తాలు పెట్టుకున్నామన్నారు. ఫైనల్ ఇయర్ పరీక్షలు కావడంతో వదులుకోరాదనే రాశానని, వరుడి కుటుంబ సభ్యులకు ముందుగానే విషయం తెలుపడంతో వారు అంగీకరించారన్నారు.

చౌడేశ్వరీదేవి కరగ ఉత్సవం

ముళబాగిలు, మే 22 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తాయలూరు గ్రామంలో 68వ వార్షిక చౌడేశ్వరిదేవి కరగ ఉత్సవం వైభవంగా సాగింది. గురువారం ఉదయం మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, విశేషపుష్పాలంకరణ చేశారు. ఆలయాన్ని తోరణాలతో ముస్తాబు చేశారు. సేవాకర్తలు ప్రసాదం పంపిణీ చేశారు. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా కుప్పం తాలూకా గోవిందపల్లికి చెందిన బాలాజి కరగను ధరించారు. కరగతో ఊరేగిన ప్రాంతాలలో స్థానిక భక్తులు ఘనంగా స్వాగతించారు. ఇళ్లముంగిట రంగవల్లులు వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, మాజీ మంత్రి నాగేశ్, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు పద్మమ్మ, ఉపాధ్యక్షుడు జాలరి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో కరగధారి

మంగళూరు విమాన

ప్రమాదానికి 15 ఏళ్లు

బెంగళూరు, మే 22(ఆంధ్రజ్యోతి): మంగళూరు బజ్పే అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన ప్రమాదానికి 15 ఏళ్లు కాగా గురువారం జిల్లా యంత్రాంగం శ్రద్ధాంజలి ఘటించింది. 2010 మే 22న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌విమానం దుబై నుంచి రాగా మంగళూరులో ల్యాండింగ్ వేళ ఒక్కసారిగా అదుపుతప్పి ఏకంగా 120 అడుగుల గోతిలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే. ప్రమాదంలో 158 మంది మృతి చెందారు. ఈమేరకు జిల్లాధికారులు, ఎయిర్‌పోర్టు ఉద్యోగులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. స్మారకానికి పూలు చల్లారు. జిల్లాధికారి ఆనంద్, మంగళూరు నగర పోలీసు కమిషనర్ రవిచంద్రనాయక్, ఏసీపీ శ్రీకాంత్ సహా పలువరు అధికారులు భాగస్వామ్యులయ్యారు.

జొన్న కొనుగోలు చేయాలని రైతుల నిరసన



రోడ్డుపై బైఠాయించిన రైతుసంఘాల నాయకులు

సిరుగుప్ప, మే 22 (ఆంధ్రజ్యోతి): జొన్న విక్రయ కేంద్రాలు సక్రమంగా పని చేయకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అధికారుల తీరుపై మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆధ్వర్యంలో రైతు సంఘాలు గురువారం సింధనూరు రోడ్డు మార్గంలో రాస్తారోకో నిర్వహించారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వలన జొన్నల బస్తాలలోనే మొలకలు వచ్చిన రైతుల నుంచి కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాలుకా పరిపాలన పూర్తిగా విఫలమైనట్లు ఆయన విమర్శించారు. రైతులకు న్యాయం చేయాలని ఆయన అధికారులపై మండిపడ్డారు. సంఘటనా స్థలానికి తహసీల్దార్ నరసప్ప సందర్శించి రెండు రోజుల్లో జొన్నల సమస్యలు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు మల్లికార్జునస్వామి, కార్యదర్శి బెళగల్ బసవరాజ, మల్లికార్జున, రైతు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఈఓ బదిలీల్లో ఇష్టారాజ్యం

- అన్యాయం జరిగిందని గ్రేడ్-1 ఏఈఓల ఆవేదన
- ఇతర కేడర్ల సిబ్బంది బదిలీల్లో సిఫార్సులకు ప్రాధాన్యం

అనంతపురం అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): ఏఈఓల బదిలీల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వ్యవసాయ శాఖలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఏఈఓలు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, క్లాస్-4 సిబ్బందికి గురువారం జేడీఏ కార్యాలయంలో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రిదాకా కౌన్సెలింగ్ కొనసాగింది. బదిలీల్లో పారదర్శకతకు పాతర వేశారన్న విమర్శలు వస్తున్నాయి. సిఫార్సులకు పెద్దపీట వేయడంతో తమకు తీరని అన్యాయం జరిగిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేడ్-1, గ్రేడ్-2 ఏఈఓల బదిలీల్లోనూ వింత వైఖరిని అవలంభించారన్న విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-1, గ్రేడ్-2 ఏఈఓలు పనిచేస్తున్నారు. గతంలో గ్రేడ్ -1 స్థానంలో గ్రేడ్-2 ఏఈఓలు, గ్రేడ్-2 స్థానంలో గ్రేడ్-1 ఏఈఓలను నియమించారు. తాజా బదిలీల్లో ఏఏ స్థానాల వారిని ఆయా స్థానాల్లోనే నియమించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల మేరకు బదిలీల ప్రక్రియకు ముందస్తుగానే గ్రేడ్-1 స్థానాల్లో గ్రేడ్ -1 ఏఈఓలను, అలాగే గ్రేడ్-2 స్థానాల్లో సంబంధిత ఏఈఓలను పంపించి, ఆ తర్వాత బదిలీల ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. అయితే ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు నేరుగా అందరినీ కౌన్సెంగ్‌కు పిలిచారు. ఇందులో ఐదేళ్లు పూర్తికాని ఏఈఓలు ఉండటం గమనార్హం. ఐదేళ్లు పూర్తికాపోయినా తమ పేర్లను బదిలీల జాబితాలో చేర్చి తీరని అన్యాయం చేశారంటూ కొందరు గ్రేడ్-1 ఏఈఓలు ఉమ్మడి జిల్లాల జేడీఏల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అవేవీ పట్టించుకోకుండా కౌన్సెలింగ్‌ను కొనసాగించడంతో బాధిత ఏఈఓలు ఏం చేయలో తోచక కొట్టుమిట్టాడుతున్నారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు బాధిత సిబ్బందికి ఏ మేరకు న్యాయం చేస్తారో వేచి చూడాల్సిందే.

పేట్రేగిపోతున్న కేబుల్ దొంగలు



కేబుల్‌వైరు కత్తిరించుకెళ్లిన దొంగలు

యాడికి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలో కేబుల్ దొంగలు పేట్రేగిపోతున్నారు. రాయలచెరువు పరిధిలోని పది మంది రైతుల తోటల్లో బోరుబావుల వద్ద బుధవారం రాత్రి వైరును కోసుకుపోయారు. సుమారు 400 మీటర్ల వైరు చోరీ అయిందని బాధిత రైతులు పరిమి చరణ్, శివరాజ్, పుల్లారెడ్డి, రమేష్ తదితరులు తెలిపారు. పదే పదే చోరీలు జరుగుతున్నాయని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండటం లేదని వాపోయారు. దొంగలు వైరు కత్తిరించుకువెళ్లే సమయంలో మిగిలిన భాగం బోరుబావిలోకి పడిపోతే తమకు మరింత నష్టం జరుగుతోందని అన్నారు. బోరుబావిలోని పైపులను బయటకు తీసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి వస్తోందని, దీనికి రూ.20 వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో చోరీలు జరిగాయి. దొంగలను నియంత్రించకపోతే పంటలను ఎండబెట్టుకోవాల్సిన పరిస్థితులు వస్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కామెడీ కిలాడీ నటుడు మనుపై అత్యాచారం కేసు



నటుడు మడనూరు మను

బెంగళూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : కన్నడలో పేరొందిన 'కామెడీ కిలాడిగళు' కార్యక్రమం నటుడు మడనూరు మనుపై అత్యాచారం, దాడితోపాటు ప్రాణాలు తీస్తామనే బెదిరింపుల కేసు నమోదు చేశారు. తోటి నటి ఫిర్యాదుకు అనుగుణంగా కేసు నమోదు చేశారు. బెంగళూరు అన్నపూర్ణేశ్వరీ నగర్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కామెడీ కిలాడిగళు అనే ప్రదర్శన హాస్యభరితంగా ప్రజాదరణ కలిగి ఉంది. ఇలా షో ద్వారా పేరొందిన మడనూరు మను కులదల్లి కీళ్యావుదో అనే సినిమా హీరోగాను నటించారు. శుక్రవారం సదరు సినిమా విడుదల కావాల్సి ఉంది. సహనటి ఒకరు అన్నపూర్ణేశ్వరి నగర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో 2018 నుంచి మను సహనటుడిగా సన్నిహితంగా ఉండేవారని పేర్కొన్నారు. కామెడీ కిలాడిగళు షో ద్వారా మరింత స్నేహితులైనట్లు పేర్కొన్నారు. 2022 నవంబరు29న శివమొగ్గలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నందుకు పారితోషికం ఇచ్చేందుకు ఇంటికి పిలిచారన్నారు. అక్కడే అత్యాచారానికి పాల్పడ్డారని ఇదే ఏడాది డిసెంబరు 3న తన ఇంటికి వచ్చి బలవంతంగా తాళి కట్టినట్లు ఫిర్యాదులో స్పష్టం చేశారు. పలుమార్లు ఇష్టం లేకున్నా అత్యాచారానికి పాల్పడ్డారని, రెండుసార్లు గర్భస్రావం కూడా చేయించారన్నారు. నాగరబావిలో ఓ ఇంట్లో ఉంచారని లైంగిక దాడికి సంబంధించి మొబైల్‌లో రికార్డు చేసుకుని ఎవరికైనా చెబితే సోషల్ మీడియాలో విడుదల చేస్తానని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. న్యాయం చేయాలని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తదుపరి పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకుంటారనేది బుల్లితెర, శాండిల్‌వుడ్ రంగంలో ఉత్కంఠ నెలకొంది.

48 గంటల్లో 1056 దరఖాస్తులు

అనంతపురం విద్య, మే 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు 48 గంటల్లోనే వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చాయి. గురువారం రాత్రికి 1,056 వరకూ వచ్చినట్లు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలిసింది. బదిలీల్లో భాగంగా గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తుకు రెండు రోజులు మాత్రమే గడువు ఇచ్చారు. బుధ, గురువారాల్లో గ్రేడ్ -2 హెచ్‌ఎంల నుంచి 184 దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజు కావడంతో చాలామంది హెచ్‌ఎంలు గురువారం శారదా స్కూల్‌లోని కౌంటర్ వద్దకు వచ్చిన దరఖాస్తులు సమర్పించారు. గ్రేడ్ -2 హెచ్‌ఎంల నుంచి 184 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 5 ఏళ్ల పూర్తి చేసుకుని, తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు 26 మంది, రిక్వెస్ బదిలీ కింద మరో 158 ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ల నుంచి 872 దరఖాస్తులు వచ్చాయి. వీరికి మరో 2 రోజులు గడువు ఉంది.



వెబెక్స్‌కు హాజరైన డీఈఓ ఇతర అధికారులు

కాంగ్రెస్ పాలన గ్యారెంటీలకే పరిమితం

- మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ

రాయచూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల కాంగ్రెస్ పరిపాలన కేవలం గ్యారెంటీ పథకాల అమలుకే పరిమితమైందని మాజీ మంత్రి, జేడీఎస్ సీనియర్ నాయకుడు హెచ్‌డీ రేవణ్ణ ఎద్దేవా చేశారు. ఒకవైపు గ్యారెంటీ పథకాల పేరుతో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరో వైపు ప్రజల పై ఆర్థిక భారాన్ని మోపు ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన హెచ్‌డీ రేవణ్ణ నగరంలో విలేకరులతో కొద్ది సేపు ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల రాష్ట్రంలోని అనేక చోట్ల పంటలు నష్టపోయి రైతులు ఇబ్బంది పడుతున్నా రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదని రేవణ్ణ ఆరోపించారు. ఒక రాయచూరు జిల్లాలోనే లక్ష ఎకరాలకు పైగా పండిన ధాన్యం నీటిపాలైన రైతులను ఆదుకునే ప్రయత్నం ప్రభుత్వం చేయకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం నష్టపోయే రైతులను ఆదుకునేందుకు తక్షణ కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బెంగళూరును మహానగరంగా తీర్చి దిద్దుతున్నట్లు ప్రభుత్వం చేస్తున్న ప్రకటన పై స్పందించిన రేవణ్ణ మహానగరం చేస్తారో? చేయరో? తర్వాత మాట ముందు ప్రజల సమస్యల పై స్పందించే గుణం ప్రభుత్వం నేర్చుకోవాలని హితవుపలికారు. తన గురించి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గె చేసిన వ్యాఖ్యల పై స్పందించేందుకు రేవణ్ణ నిరాకరించారు. ఖర్గె అంత పెద్ద మనిషి గురించి మాట్లాడే స్థాయి తనకు లేదని కాని తనను రాజకీయంగా తగ్గించే శక్తి ప్రజలకు, దేవుడికి తప్పా ఎవ్వరికి లేదంటు పరోక్షంగా దెప్పిపొడిచారు. కాగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పై త్వరలోనే పార్టీలో చర్చించి తగిన పోరాట కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. అనంతరం జిల్లా కేంద్రం నుంచి మంత్రాలయంకు బయలుదేరి వెళ్లిన రేవణ్ణ రాఘవేంద్ర స్వామి దర్శన అనంతరం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదుల వారిని కలిసి ఆశీర్వాదం పొందారు. రేవణ్ణ వెంట పార్టీ జిల్లా కార్యధ్యక్షుడు ఎన్.శివశంకర్ అడ్వకేట్, రాష్ట్ర ఎస్టీశాఖ ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిపతి గాణదాళ్, రూరల్ అధ్యక్షుడు నాగరాజ్, జిల్లా ఎస్టీ శాఖ అధ్యక్షుడు హంపయ్య నాయక్, నేతలు ఆదిరాజ్, నరసింహ నాయక్, దుళ్ళయ్య నాయక్, సుధాకర్ గౌడ తదితరులున్నారు.



మంత్రాలయం పీఠాధిపతి ఆశీర్వాదం పొందుతున్న మాజీ మంత్రి రేవణ్ణ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.07	1,577.53
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	6,261	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,139	0
నీటి నిల్వ (టీఎంసీలు)	8.75	3.39

29 నుంచి పాఠశాలల ప్రారంభం

● 57.51శాతం పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి
● తొలిరోజే పూర్తిస్థాయిలో అందిస్తాం
: జిల్లా విద్యాశాఖ అధికారి ఉమాదేవి



బళ్లారి గాంధీనగర్, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 29 నుంచి పాఠశాలలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఉమాదేవి తెలిపారు. కర్ణాటక పాఠ్యపుస్తక సంఘం బళ్ళారి జిల్లాకు ఇప్పటికే 57.51 శాతం పుస్తకాలు పంపిణీ చేశారని, ఇందులో ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు ఉన్నట్లు వివరించారు. రెండు మూడు రోజుల్లో మిగిలిన పాఠ్యపుస్తకాలు జిల్లాకు రానున్నట్లు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న పుస్తకాలను ఇప్పటికే తాలూకాల వారీగా ప్రభుత్వ పాఠశాలకు పంపినట్లు, ఆయా తాలూకాల తాలూకా విద్యాశాఖ అధికారులకు పుస్తకాల పంపిణీ బాధ్యతలను అప్పగించినట్లు ఆమె పేర్కొన్నారు. పాఠశాల తెరిచిన రోజే మిగతా పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. పుస్తకాలు జాగ్రత్తగా భద్రపరచాలని బీఈఓలకు సూచించినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సమవస్త్రాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కావాల్సిన వారు ప్రైవేట్ సంస్థల నుండి రూ 10శాతం పుస్తకాలపై ఫీజులు చెల్లిస్తే పుస్తకాలు అందజేస్తామన్నారు. ఆయా బ్లాక్ స్థాయిలో నోడల్ అధికారుల వద్ద ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం అందుకు ప్రత్యేక ఫీజును నిర్ణయించినట్లు స్పష్టం చేశారు.

ఘనంగా హనుమజ్జయంతి

సిరుగుప్ప, మే22(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి. గురువారం సిరుగుప్ప తాలుకాలో దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన అంజనేయ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్యామాచార్య ఆధ్వర్యంలో ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పుష్పాలంకార సేవ, ప్రభావళి, పంచామృతాభిషేకం, వివిధ ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన సేవలు చేపట్టారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.



అలంకరణలో పేటె ఆంజనేయస్వామి

చిన్నారులకు రూబెల్లా వ్యాక్సిన్ తప్పనిసరి: డీహెచ్‌ఓ

బళ్లారి గాంధీనగర్, మే 22(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా 9 నెలలు నిండిన చిన్నారులకు తట్టు-రూబెల్లా టీకాలు వేయించి అంటువ్యాధుల నుంచి కాపాడుకోవాలని గుల్బర్గా విభాగం ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శరణ బసప్ప గణజలఖేడ పేర్కొన్నారు. నగరంలోని డిహెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బుధవారం ఏర్పాటు వైద్యాధికారుల జాగృతి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్యంగా వేసవిలో ఎక్కువగా చెమట పట్టడం ద్వారా దేహంపై గుళ్లలు లాంటివి ఏర్పడడం సహజమని, దడారా అంటువ్యాధి కూడా ఇదే రీతిలో కనిపిస్తుందని, ముందు జాగ్రతగా ఎలాంటి తప్పుడు సమాచారం నమ్మకుండా పిల్లలకు దడారా రూబెల్లా టీకా వేయించాలన్నారు. జిల్లా ఆరోగ్య కుటటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ యల్లా రమేష్ బాబు మాట్లాడుతూ, తట్టు వైరస్ సోకిన చిన్నారి నుంచి మరో చిన్నారికి వచ్చే అవకాశం ఉంటుందని, జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ విషయంపై కూడా ప్రజలకు తెలియ జేయాలని కోరారు. తట్టు సోకిన వ్యక్తినుండి ఈ వ్యాధి పది రోజుల తరువాత కనిపిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి రెండు నుంచి నాలుగు రోజుల వరకు ఉంటుందన్నారు. జ్వరం, ఆయాసం, తీవ్ర దగ్గ, కళ్ళు ఎర్రబడడం, ముక్కునుండి నీరు కారడం, నోటిలో తెల్లటి చుక్కలు ఏర్పడడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని తెలలిపారు. తట్టు మొదట తల నుండి ప్రారంభం అవుతుందని, అనంతరం దేహంలో ఇతర భాగాలకు సోకుతుంది. ఇది సామాన్యం ఏడు రోజుల వరకు ఉంటుంది. ఒక వేళా ఈ తట్టు సోకినపుడు నిర్లక్ష్యం చేస్తే వాంతి విరేచనాలు, న్యూమోనియా వ్యాధికి గురై చిన్నారి మృతిచెందే పరిస్థితి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఐదేళ్ళలోపు వయస్సు కలిగిన అందరికి అధికంగా ఒక డోస్ టీకా వేయించడంతోపాటు విటమిన్-ఎ అను ద్రావణాన్ని కూడా ఇవ్వాల్సి ఉంటుంది. నగర ప్రాంతంలోని మురికి వాడల ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ జాగృతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డబ్ల్యూహెచ్‌ఓ పర్యవేక్షణ అధికారి డాక్టర్. ఆర్ఎస్ శ్రీధర్, జిల్లా రోగవాహన ఆశ్రిత రోగాల నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్. అబ్దుల్లా, జిల్లా సర్వేక్షణాధికారి డాక్టర్ మరియంబి, జిల్లా ఆర్‌సిహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప, జిల్లా కుటటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ పూర్ణిమా కట్టమని, జిల్లా క్షయరోగ నిర్మూలణ అధికారి డాక్టర్ ఇంద్రాణి, జిల్లాకుష్టు రోగ నిర్మూలనాధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్‌లతో పాటు జిల్లా పరిధిలోని అన్ని తాలూకాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు

ధ్యానంతో మానసిక ప్రశాంతత

● బ్రహ్మకుమారి ఈశ్వరీయ జిల్లా అధిపతి సుదేశ్ దీదీజీ



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుదేశ్ దీదీజీ

బళ్లారి సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో సంపూర్ణ మానసిక ఆరోగ్యం సాధ్యమని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ అధిపతి సుదేశ్ దీదీజీ అన్నారు 2025-26 వార్షిక సేవా ప్రణాళికలో భాగంగా గురువారం హొసపేటలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సురభి కల్యాణ మంటపంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. జాతి, రంగు, లింగ ,ఆర్థిక అడ్డంకులు మనుషుల మధ్య తొలగాలన్నారు. పంచేంద్రియాలను అదుపులో పెటుకున్నపుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రాంతీయ అధిపతి బసవరాజ్ మాట్లాడుతూ మన ప్రస్తుత అశాంతి కోరికలు, ఆకాంక్షల వల్లనే వచ్చాయన్నారు. పరమాత్ముడు మాత్రమే దీనికి పరిహారం ఇవ్వగలడు. ఇది కలిగయుగం ముగింపునకు సంకేతమన్నారు. బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీ విశ్వవిద్యాలయం అటువంటి సత్యాన్ని, ఏకత్వాన్ని సాధించడానికి రాజయోగ మార్గాన్ని వెల్లడిస్తుందన్నారు. వేదికపై గదగ్‌కు చెందిన జయంతి అక్క, గంగావతి సులోచన అక్క, ఆలూరుకు చెందిన లక్ష్మీ అక్క, యోగిన అక్క, శివమొగ్గ నుంచి స్వాతి అక్క, హొసపేట కల్సిలేటర్ మానస అక్క, రిటైర్డ్ ప్రిన్సిపాల్ శశిధర, కన్నడ సంస్కృతిక శాక డిప్యూటీ డైరెక్టర్ సిద్దలింగ రంగన్ననవర్ పాల్గొన్నారు.

కనుగోలు తిమ్మప్పకు ఘన నివాళి



కనుగోలు తిమ్మప్ప విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బళ్లారి వాణిజ్య సంస్థ ప్రతినిధులు

బళ్లారి సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత కాకర్లతోట కనుగోలు తిమ్మప్ప 25వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఎంసీ ప్రాంగణంలో కనుగోలు తిమ్మప్ప వర్ధంతిని నిర్వహించారు. అనంతరం రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, సీనియర్ ఉపాధ్యక్షుడు మంజునాథ్, గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు, ఉపాధ్యక్షులు దొడ్డనగౌడ, సొంత గిరిధర, జాయింట్ సక్రటరీలు మల్లికార్జునగౌడ, రామచంద్ర, సంస్థ మాజీ అధ్యక్షుడు చెన్నప్ప, హాస్పెటల్ చైర్మన్ శ్యామ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సురేంద్ర కుమార్ తదితరులు హాజరయ్యారు.

గనుల ప్రభావిత ప్రాంతాల కోసం సమగ్ర ప్రణాళిక

బళ్లారి సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర పర్యావరణ ప్రణాళికను బళ్లారి సహా నాలుగు జిల్లాల్లో అమలు చేస్తున్నారని గ్రామ్ ఇనిస్టిట్యూట్ సభ్యులు మహేశ్ కుమార్ తెలిపారు. గురువారం బళ్లారి తాలూకాలోని హలకుంది, బెళగల్లు సబ్ క్యాచ్‌మెంట్ ప్రాజెక్ట్ ప్రాంతంలోని హలకుంది గ్రామ పంచాయితీ హాల్లో వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, వ్యవసాయ శాఖ , గ్రామ్ ఇనిస్టిట్యూట్ లింగసుగూర్ సహకారంతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హలకుంది బెళగల్లు ప్రాంతంలో దాదాపు 6గామాలు ఈ ప్రాజెక్ట్ కిందకు వస్తాయని ఆయన అన్నారు. భూగర్భ జలాల స్థాయిని పునరుద్ధరించడం, నీటి స్థాయిని మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవడం. నేల, నీటి సంరక్షణ ద్వారా నేల కోతను నివారించడం పశువులకు తాగునీటి వ్యవస్థలు, వ్యవసాయ కార్యకలాపాల్లో ఉపయోగం కోసం వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాల ద్వారా నీటిని ఆదాచేయడం వ్యవసాయ ఉత్పత్తిని నిలబెట్టడం, రైతు సమాజ జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. స్వయంగా స్వయం సహాయక బృందాలకు ఆదాయ ఉత్పత్తి కార్యకలాపాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా స్వావలంబన పొందుతారని, ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ అధికారి బసవరాజ్ మాట్లాడుతూ ప్రాజెక్టను పర్యవేక్షించడానికి అవసరమైన రికార్డులను నిర్వహించడానికి వాటర్‌షెడ్ కమిటీ పనిచేస్తుందన్నారు. సమావేశంలో గ్రామ పంచాయితీ అధ్యక్షుడు, సభ్యులు, వ్యవసాయ శాఖ వ్యవసాయ అధికారులు, సాంకేతిక అధికారులు, అమలు సంస్థ సీఈఓ, సబ్ వాటర్‌షెడ్ బృందనాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ కుమార్



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

డిమాండ్లు నెరవేర్చాలని ఆశావర్కర్ల నిరసన

బళ్లారి సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): దేశంలోని కార్మిక వర్గ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక రాష్ట్ర యునైటెడ్ ఆశా వర్కర్స్ అసోసియేషన్ బళ్లారి జిల్లా కమిటీ ఆఫీస్ బేరర్లుజిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు.నిరసన కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర ఐక్య వర్కర్స్ అసోసియేషన్ నాయకులు నాగలక్ష్మి మాట్లాడుతూ.. దేశంలోని కార్మికులకు కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. గత జనవరిలో ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేసినప్పుడు ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.10వేలు నెలవారీ గౌరవ వేతన పెంపును అమలు చేయాలన్నారు. ఇటీవల పార్లమెంట్ సమావేశంలో కేంద్ర ఆరోగ్య మంత్రి ప్రకటించిన ప్రోత్సాహక చెల్లింపుల ఇవ్వాలని, ఆశా అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన వర్కర్లను పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ. 36వేలు నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కర్ణాటక రాష్ట్ర ఐక్య వర్కర్స్ అసోసియేషన్ నాయకులు సోమశేఖర్ యాదగిరి, శాంత, గీత, రేష్మ, ఉమాదేవి, శశికళ, శాంతకుమారి, ఎర్రెమ్మ పాల్గొన్నారు.

పందుల అపహరణకు యత్నం

● దేహశుద్ధి చేసిన స్థానికులు

బళ్లారి గాంధీనగర్, మే 22(ఆంధ్రజ్యోతి): పందులు దొంగిలించిన వ్యక్తిని స్థానికులు దేహశుద్ధి చేశారు. సిరుగుప్ప తాలూకా పరిధిలోని మోకా పోలీసు స్టేషన్ పరిధిలోని సింధువాళ గ్రామంలో పందులను దొంగిలించాడన్న ఆరోపణల నేపథ్యంలో ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సింధువాళ గ్రామం పరిధిలోని యర్రగుడి రామాంజినికి చెందిన పందుల మంద నుండి పందులను శంర్ కోళి, మరో ఇద్దరు బొలెరో వాహనంలో తరలిస్తుండగా స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. రామాంజికి చెందిన మూడు పందులు, గూల్యం శంకర్‌కు చెందిన ఐదు, మొత్తం 8పందులతో పాటు దొంగతానికి పాల్పడుతున్న వారిలో ఒకరు చిక్కాడు. దొంగలించిన పందుల విలువ రూ 80వేలు అని యజమాని పేర్కొన్నారు. స్థానికులు నిందితుడిని పట్టుకుని విద్యుత్ స్థంబానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు పరారయ్యారు. ఈ మేరకు మోకా పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్దతు ధరతో సూర్యకాంతి కొనుగోలు

బళ్లారి గాంధీనగర్, మే 22(ఆంధ్రజ్యోతి): మద్దతు ధరతో రైతుల నుంచి సూర్యకాంతి కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా 2024-25 ఏడాది రబీలో సాగుచేసిన ఎఫ్ఎక్యూ ప్రమాణాలు కలిగిన సూర్యకాంతి పంటను రైతుల నుంచి ఖరీదు చేయనున్నట్లు బళ్లారి జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర యోజనలో నిర్ణయించిన మద్దతు ధర ప్రతి క్వింటాల్ సూర్యకాంతికి రూ 7,280లు ప్రకారం ఖరీదు చేయనున్నట్లు తెలిపారు. బెంగళూరుకు కర్నాటక సహకార ఆయిల్ అండ్ సీడ్స్ ఉత్పత్తిదారుల మహామండలి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాలను బళ్లారి నగరంలోని ఏపీఎంసి పాలనా కార్యాలయం (8722047272, 636675388) చేరుకుని వివరాలు పొందవచ్చు. రైతులు ఈ అవకాశాన్ని సద్వియోగం చేసుకోవాలన్నారు. అందుకోసం రైతులు ఆధార్‌కార్డు, ప్రస్తుతం ఏడాది పహణీ, ఎఫ్ఐడీ కచ్చితంగా రైతులు కలిగి ఉండాలన్నారు.

పగలే ఎలుగుబంట్ల సంచారం

కంప్లి, మే 22(ఆంధ్రజ్యోతి): మూగజీవులకు అడవుల్లో ఆహారం లేకపోయేసరికి అవి గ్రామాలు, పట్టణాల్లోకి వచ్చేస్తున్నాయి. రెండు రోజుల క్రితం బుక్కసాగర గ్రామంలోకి ఎలుగుబంటి ఆహారం కోసం వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగానే హొస్పేట పట్టణం దగ్గరలోని జోళదరాసి కొండలో గురువారం మధ్యాహ్నం ఎలుగుబంటి కనిపించింది. నగర శివార్లలోని జోళదరాశి కొండలో ఒక ఎలుగుబంటి కనిపించింది. బేర్ హిల్ అంచున నిర్మించిన కట్ట దగ్గర అది పరిగెత్తుతుండగా విహారయాత్ర కోసం వచ్చిన యాత్రికులు తమ మొబైల్‌లో ఫొటోలు తీశారు. ఈ వీడియో ప్రస్తుతం అన్నిచోట్లా వైరల్ అవుతోంది. ప్రతిరోజు కొండపై వాకింగ్ వెళ్లే ప్రజలు ఇప్పుడు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు ఎలుగు బంటిని పట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జోళదరాశి వద్ద కొండపై కనిపించిన ఎలుగుబంటి

హోసూరు జోన్



బూత్‌స్థాయి సమావేశంలో మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

బూత్‌స్థాయి కమిటీ సమావేశం

హోసూరు, మే 22(ఆంధ్రజ్యోతి): వచ్చే శాసనసభ ఎన్నికల కోసం అన్నిపార్టీల నాయకులు కసరత్తు సాగిస్తున్నారు. కృష్ణగిరి పశ్చిమజిల్లా శూలగిరి యూనియన్ కామందొడ్డి గ్రామంలో అన్నాడీఎంకే బూత్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు. పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో అధికారంలోకి రావడమే లక్ష్యమని పిలుపునిచ్చారు. పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటుతుపాకులు స్వాధీనం - ఒకరి అరెస్టు



నాటుతుపాకులతో నిందితుడు

హోసూరు, మే 22(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా అంచెట్టి సమీపంలోని లైసెన్స్‌లేని 2 నాటుతుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం సీఐ బంగజం ఆధ్వర్యంలో పసప్పన్ (50) ఇంట్లో తనిఖీలు చేయగా అనుమతి లేని నాటు తుపాకులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ లేని నాటు తుపాకులు కలిగి ఉండడం నేరంగా పరిగణించి అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు పరిశీలన

రొళ్ల, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డుగురికి, గొల్లహట్టి గ్రామాల్లో వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దెబ్బతిన్న రోడ్లను గురువారం పరిశీలించారు. అధికారులతో ఆయన చర్చించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, మాజీ ఎంపీపీ పాండురంగప్ప, రామక్రిష్ణ, నాగరాజు, హేమంత్ పాల్గొన్నారు. మడకశిర టౌన్: పట్టణంలోని షిర్డీసాయి ఆలయం వద్ద కాలువ ఏర్పాటు కోసం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి గురువారం పలువురు భక్తులతో కలసి భూమి పూజ చేశారు.

ఐఎఫ్ఎస్ ర్యాంకర్‌కు నాయకుల అభినందనలు



సంతోష్‌ను అభినందిస్తున్న వేపనహళ్ళి ఎమ్మెల్యే మునుస్వామి



హోసూరు ఎమ్మెల్యే వై ప్రకాశ్

హోసూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఐఎఫ్ఎస్ పరీక్షల్లో 138వ ర్యాంకు సాధించిన విద్యార్థి సంతోష్‌ను వివిధపార్టీల నాయకులు అభినందించి సత్కరిస్తున్నారు. అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ, వేపనహళ్ళి ఎమ్మెల్యే కేపీ మునుస్వామి స్వయంగా అభినందించారు. మిఠాయిలు అందచేసి శాలువాతో సత్కరించారు. దేశానికి గొప్ప సేవలు చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శూలగిరి సెంట్రల్ యూనియన్ కార్యదర్శి మాదేశ్, తదితరులు ఉన్నారు. కాగా హోసూరు ఎమ్మెల్యే వై ప్రకాశ్ కూడా స్వయంగా సత్కరించి అభినందించారు. యువత సంతోష్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

జొన్న కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

రాయచూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో పండించిన పూర్తిస్థాయి జొన్నలు కొనుగోలు చేయాలంటు రైతులు ఆందోళనకు దిగారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర ఆధారంగా కొనుగోలు ప్రారంభించి ఇప్పటివరకి పూర్తి చేయకపోవడాన్ని రైతులు తప్పుబట్టారు. ఇందుకు నిరసనగా గురువారం జిల్లాలోని సింధనూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కాగా కొనుగోలు చేసిన జొన్నలు గ్రేడింగ్ సరిగాలేదంటు నాణ్యతగా లేవంటు నాణ్యతగా లేవంటు గ్రేడర్లు ఖరీదు చేసినా లోడ్‌ను వెనిక్కి పంపడంతో ఆగ్రహించిన రైతులు అదే లోడ్‌తో తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డు పై ఆపి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా రైతులు దాదాపు గంటసేపుకు పైగా ఆందోళన కొనసాగించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తెస్తానని ఆందోళన విరమించాలని నచ్చజెప్పారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

● రోడ్డు ప్రమాద బాధితులను దగ్గరుండి అంబులెన్స్‌లో తరలించిన అన్నపూర్ణ తుకారాం



అంబులెన్స్ వద్ద ఎమ్మెల్యే అన్నపూర్ణ

కంప్లి, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడ్డ బాధితులను దగ్గరుండి ఆస్పత్రికి తరలించి ఎమ్మెల్యే అన్నపూర్ణ మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం సాయంత్రం సండూరు నుండి కూడ్లిగికి అమ్మవారి జాతరకు వెళ్లే మార్గంలో రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై పడి ఉన్నారు. అదే దారిలో వెళ్తున్న ఎమ్మెల్యే వారిని గమనించి వెంటనే తమ కారును ఆపి అంబుల్‌న్స్ రప్పించింది. అంబులెన్స్ వచ్చే దాక అక్కడే ఉండి వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపింది. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపద సమయంలో ఆదుకోవడం కనీస ధర్మమని, కేసులకు భయపడకుండా అందరూ ముందుకు రావాలన్నారు.

వైభవంగా నిరుపాదేశ్వర రథోత్సవం

రాయచూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముదుగల్ పట్టణ సమీపం అంకలి గ్రామంలో వెలసిన నిరుపాదేశ్వర స్వామి మహా రథోత్సవాన్ని బుధవారం రాత్రి అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఏటా వైశాఖ బహుళ దశమి నాడు నిర్వహించే ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుముట్టు గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలి వచ్చారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు